క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో ఈవీఎం (ఎలక్ట్రాన్ ఓటింగ్ మిషన్)ల పనితీరుపై తహసీల్దార్ శేషఫణి అవగాహన కల్పించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలోని సెంట్రల్ యూనిట్, కంట్రోల్ యూనిట్ల పనితీరు, వీవీ ప్యాట్‌ల ఉపయోగంపై రాజకీయ పార్టీ నాయకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో నెల రోజుల పాటు ఈవీఎంల వినియోగం, పనితీరుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి, ఈఓఆర్డీ సందీప్, వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ నరసింహుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బసయ్య, రఘురెడ్డి, ఏలియా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గడ్డి వాముల దగ్ధం

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన గుండ్లకొండ గోపాల్ అనే రైతు ముడుమాల గ్రామానికి వెళ్లే దారిలోని కల్లందొడ్డిలో ఏర్పాటు చేసుకున్న గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. ఇందులో 5 బండ్ల వేరుశనగ గ్రాసంతో పాటు మరో రెండు బండ్ల జొన్న, మొక్కజొన్న గ్రాసం అగ్నికి ఆహుతి అయ్యాయి. దాదాపు రూ.45 వేలకు పైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. వీఆర్వో తిమ్మన్న అక్కడికి చేరుకొని నష్ట వివరాలను నమోదు చేసుకున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటసుబ్బయ్య

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ అశోక్ శనివారం తెలిపారు. వివరాలు..గ్రామానికి చెందిన మజారీ వెంకటసుబ్బయ్య(54) కొంతకాలంగా మూర్ఛవ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో చెరువు వద్దకు కాళ్లు కడుక్కునేందుకు వెళ్లగా ఉన్నటుండి ఫిట్స్ రావడంతో చెరువులో పడిపోయాడు. గమనించిన స్థానికులు బయటకు తీసేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య సావిత్రి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

వెండి పడిగె వితరణ



పడిగెను అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి శనివారం వెండి పడిగెను బహూకరించారని ఈఓ రామకృష్ణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల మండలం కోటపాడుకు చెందిన మేర్వ సుబ్బారెడ్డి కుమారుడు మేర్వ దేవానాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు స్వామి వారికి 950గ్రాముల వెండి పడిగెను అందజేశారని చెప్పారు. అనంతరం దాతలకు స్వామి వారి శేషావస్త్రాలు అందించి ప్రత్యేక పూజలు చేయించినట్లు చెప్పారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన గొల్ల హనుమంతు అనే ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన బీమా సాయం రూ.10వేలను అందజేశారు. గ్రామ సర్పంచ్ పాండురంగన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు మృతుడి భార్య పార్వతమ్మకు అందజేశారు. మిగతా సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలో జమఅవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి బాయికాటి మద్దిలేటి, సచివాలయ కన్వీనర్ రఘురెడ్డి, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ జట్టుకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : ఈనెల 25 నుంచి 30 వ తేదీ వరకు చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డి.వి.ఆర్. సాయిగోపాల్ అన్నారు. శనివారం స్థానిక క్లస్టర్ వర్సిటీ ప్రాంగణంలో వర్సిటీ జట్టు క్రీడాకారులకు స్పోర్ట్స్ యూనిఫామ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీమ్ మేనేజర్ ఫణీనిఖిల్ హర్ష పాల్గొన్నారు.






సి.బెళగల్‌లోని శ్రీ రంగనాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న పురోహితుడు, క్రిష్ణదొడ్డి కొండపై పూజలందుకుంటున్న శ్రీ కోనావేంకటేశ్వర స్వామి, ప్రత్యేకంగా ఏర్పాటైన ఉత్తర ద్వారంలో శ్రీనివాసుడు, భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వైకుంఠద్వార దర్శనం సకల పాపహరణం

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి
- వేకువజామునే ప్రారంభమైన పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో వీరనారాయణస్వామి



ఎస్సార్బీసీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు రద్దీ

సి.బెళగల్:మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని ఆలయాలు వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిలాడాయి. శనివారం మండలంలోని కృష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను పూజారులు నిర్వహించారు. వైకుంట ఏకాదశి రోజున వైకుంఠం ద్వారాలు తెరుచుకుని ఉంటాయని, ముక్కోటి దేవుళ్లు శ్రీ వారి దర్శించుకుంటారని, ఈ సందర్భంగా ఆలయాలకు చేరుకుని ప్రార్థనలు చేస్తే సకల దేవతల అనుగ్రహంతో పాటు భక్తుల పాపాలు తొలగి, వైకుంఠ ప్రాప్తి లభిస్తుందన్నది భక్తుల నమ్మకం. వేకువజాము నుంచి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కొండపై పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు ఉత్తరద్వార ప్రవేశాలను కల్పించారు. తహసీల్దార్ శేషఫణి రెవెన్యూ అధికారులతో కలిసి స్వామి వారి దర్శించుకుని పూజలను చేపట్టారు. శ్రీ కోనా వేంకటేశ్వరస్వామి, శ్రీ రంగనాథ ఆలయ ప్రాంగణాలలో నిర్వహకులు అన్నదాన కార్యక్రమను నిర్వహించి, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అదేవిధంగా సి.బెళగల్ శ్రీ రంగస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశాలను కల్పించారు. ఆలయంలో గ్రామ సర్పంచ్ పాండురంగన్న పార్టీ సభ్యులతో కలిసి పూజలలో పాల్గొని అర్చన, అభిషేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా పోలకల్, కొత్తకోట, ముడుమాల, గుండ్రేవుల, కంబదహాల్ గ్రామాలలోని ఆలయాలలో కూడా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.



గోరంట్ల మాధవుడికి పూజలు నిర్వహిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గోరంట్ల మాధవుడికి పూజలు

కోడుమూరు : ముక్కోటి ఏకాదశి వేడుకలను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలు, గోరంట్ల శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనాన్ని ఏర్పాటు చేయగా ప్రజలు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని గోరంట్ల శ్రీలక్ష్మి మాధవస్వామికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచు బాలకృష్ణ, ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు.

పాణ్యం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి. శనివారం తెల్లవారుజామున 4గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనానికి అనుమతించారు. మండల కేంద్రంలో తెల్లవారుజామున 3గంటల నుంచే స్వామి వారి కైంకర్యాలు ప్రారంభమైయ్యాయి. 4.30గంటల వరకు శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం, తులసీ మాల అలంకారణం, అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

- ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున నుంచి ఉదయం 10గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అర్చకులు మురళీ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.
- శ్రీకృష్ణ ఆలయంలో తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమైయ్యాయి. అర్చకులు కృపాకర్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు.

కల్లూరు: కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. పాత కల్లూరులో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



దుర్వేశిలో ఉత్తమ రైతు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న డీఏఓ మోహన్‌రావు

గడివేముల: రబీలో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు తెలిపారు. మండలంలోని దుర్వేశి ఆర్బీకేలో డాక్టర్ చరణ్ సింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ వ్యవసాయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతులు,వ్యవసాయ సిబ్బందితో అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి పంటలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడిన సాధించడానికి రైతుభరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. గ్రామ పరిధిలో ఈ ఏడాది వరి పంట సరాసరి దిగుబడి 35 - 40 బస్తాలు వచ్చిందన్నారు. ఆర్బీకేలో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. తదనంతరం పొలంబడితో అధిక దిగుబడి సాధించిన వెంకటరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి, సర్పంచ్ మండ్ల మమత, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్

పాణ్యం: మండలంలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల విద్యార్థినులు ఫోర్త్ జోన్ క్రీడల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు జిల్లా రేణిగుంటలో జరిగిన గురుకులం ఫోర్త్ జోన్ చెస్ పోటీల్లో పూజ, 100 మీటర్ల రన్నింగ్‌లో లీలావతి, 200 మీటర్ల పోటీల్లో రెండవ స్థానంలో పి. లీలావతి, 400, 800 మీటర్ల రిలే రేస్‌లో చంద్రకళ, దీపిక, భాను, లీలావతి రాణించారని చెప్పారు. కృషి చేసిన పీడీ, పద్మావతి, సీతాబాయి, సుబ్రహ్మణ్యంను వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీతో కలిసి అభినందించారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: గ్రామాలలో చేపడుతున్న భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కంబదహాల్ గ్రామ సచివాలయంలో జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథక నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు రీ సర్వేలో తమ భూముల వివరాలు తప్పుగా నమోదవడం, తక్కువ భూమిని రికార్డులో నమోదు చేయడం, ఒకే పాసు పుస్తకంలో కొంత మంది రైతులకు హక్కులు కల్పించడం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా రీ సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆట స్థలాల పరిశీలన



ఏ.గోకులపాడులో మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల నిర్వహణ కోసం నెరవాడ, ఏ.గోకులపాడు, పర్ల, కే.మార్కాపురం, బస్తిపాడు గ్రామాల్లోని మైదానాలను ఎంఈఓ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలో ఆట స్థలాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు ఉండేలా చుడాలని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి



కె.నాగలాపురంలో చిన్నారి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

గూడూరు రూరల్ : గర్భిణులు, చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. కె.నాగలాపురంలోని పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదు ఏళ్లలోపు పిల్లలకు ఇవ్వవలసిన టీకాల గురించి వివరించారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూ అవసరమైన చికిత్సను అందించాలని సూచించారు. అనంతరం పీహెసీలోని స్టాక్, ల్యాబ్, స్టోర్ రూం, రిపోర్టులు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి శ్రీనివాసులు ఉన్నారు.

అయోధ్యకు 108 కోట్ల శ్రీరామనామ లిఖిత పుస్తకాలు

కర్నూలు కల్చరల్: ఆవోపా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 108 కోట్ల శ్రీరామనామ లిఖిత పుస్తకాలను శనివారం అయోధ్యకు పంపారు. స్థానిక గోశాలలో ఆ పుస్తకాల తరలింపు వాహనానికి టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ జనవరి 22వ తేదీన అయోధ్య రామ మందిరం ప్రారంభానికి సంఘీభావంగా ఆవోపా ఏప్రిల్ నెలలో ప్రతిష్టాత్మకంగా శ్రీరామ నామ లిఖిత యజ్ఞాన్ని చేపట్టిందన్నారు. మొదటి విడతలో ఇప్పటి వరకు అందిన 6,732 పుస్తకాలను 102 బాక్సులలో అయోధ్యకు పంపామన్నారు. ఇందులో 10 వేల మంది పాల్గొన్నారన్నారు. రెండో విడత ఫిబ్రవరిలో ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన వారికి 108లో చికిత్స చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని సుగాలిమెట్ట సమీపంలో కొచ్చెరువు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని 108 సిబ్బంది తిరుపాల్, చెన్నయ్య శనివారం తెలిపారు. బండిఆత్మకూరు మండలం పార్లపల్లె గ్రామానికి మౌంటెన్, సుధామణి సోమయాజులపల్లె వైపు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిందన్నారు. సమాచారం అందకున్న 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి పాణ్యం ఆసుపత్రికి తరలించారు.

జీవిత మార్గదర్శి భగవద్గీత

కర్నూలు కల్చరల్: విద్యా ప్రకాశానంద గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో భగవద్గీత సహస్ర గళ పారాయణం చేశారు. గీతా జయంతిని పురస్కరించుకొని శనివారం సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ వశిష్టాశమ లలితా పీఠం సంస్థాపక పీఠాధిపతి పూజ్యశ్రీ స్వరూపానందగిరి స్వామి, విజయవాడ శ్రీమద్ అష్టాక్షరి పీఠం పీఠాధిపతి శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహ భాషణం చేశారు. స్వరూపానందగిరి స్వామి మాట్లాడుతూ జీవిత మార్గదర్శి భగవద్గీత అన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణంతో ఆలోచనా ధోరణిలో మార్పు సంభవిస్తుందన్నారు. సంఘం అధ్యక్షుడు డి.వి. రమణ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం సాయంత్రం ధ్యానం, భగవద్గీతపై స్వరూపానంద గిరి స్వామి ఉపన్యసిస్తారన్నారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష పాల్గొని స్వామీజీలను సన్మానించారు. కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు జగన్నాథ గుప్త, అనంత అనిల్ కుమార్, సింహాద్రి రమేష్, మారం అనిల్, సత్యసాయి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సాయిబాబ భక్త మండలి కార్యదర్శి మహబలేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రానెట్ క్వారీపై అధికారుల దాడులు



హిటాచీని సీజ్ చేసిన మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో సర్వే నంబర్ 38లో అక్రమంగా రాత్రిపూట గ్రానైట్ క్వారీ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో క్వారీలో తవ్వకాలు సాగిస్తున్న హిటాచీని సీజ్ చేశారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ తాడిపత్రికి చెందిన దూదేకుల మహమ్మద్ రఫీ రాత్రిపూట అక్రమ క్వారీ నిర్వహిస్తున్నాడని విచారణలో తేలిందన్నారు. హిటాచీ కంప్రెజర్‌ను పెద్దకడబూరు పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీరినట్లే



చనుగొండ్లలో ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్



ఎస్సీ కాలనీలో వేసిన మినీ సిమెంటు ట్యాంకు

- ఏళ్ల నుంచి చనుగొండ్లలో తాగునీటి సమస్య
- పట్టించుకోని గత పాలకులు, ప్రజాప్రతినిధులు
- ఎమ్మెల్యే చొరవతో రూ. 20 లక్షలతో పైపులైన్, మినీ సిమెంటు ట్యాంకుల నిర్మాణం
- దాదాపు పూర్తయిన పనులు
- ఇప్పటికే పలు కాలనీలకు నీటి సరఫరా

గూడూరు రూరల్ : ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా చనుగొండ్ల వాసుల తాగునీటి సమస్య మాత్రం పరిష్కరించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంది. సమస్యను ఎమ్మెల్యేను దృష్టికి తీసుకెళ్లగా కేవలం రెండు నెలల్లో బోర్లు, ట్యాంకులు, పైపులైను పనులు పూర్తి చేయించారు.

వెంటనే స్పందించిన ఎమ్మెల్యే

చనుగొండ్లలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో 2000 జనాభా ఉంది. ఆ కాలనీల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. సమస్యను నెలన్నర కిందట స్థానికులు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రూ.20 లక్షలతో పనులు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే భూమిపూజ చేసి తాగునీటి పైపులైన్ పనులకు భూమి పూజ చేశారు. అధికారులు కూడా తరచూ పర్యవేక్షిస్తుండటంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

13 సిమెంటు ట్యాంకుల నిర్మాణం

పైపులైన్ పనులతో పాటు బోర్లకు విద్యుత్ మోటార్లు బిగించారు. అలాగే ఎస్సీ, బీసీ కాలనీల్లో 13 సిమెంటు ట్యాంకులను ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికే ఎనిమిది మినీ ట్యాంకు పనులు పూర్తి కాగా మిగిలిన వాటికి సంబంధించి దిమ్మెల నిర్మాణాలు జరుగుతున్నాయి. కాలనీల్లో ఏర్పాటు చేసే ట్యాంకుల వరకు పైపులైన్ పనులు పూర్తి అయ్యాయి. ఇప్పటికే బోర్ల ద్వారా కొన్ని ట్యాంకులకు నీటి సరఫరాను అధికారులు చేపట్టారు. రానున్న 20 రోజుల్లో మిగిలిన ట్యాంకుల పనులు పూర్తి చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కేవలం రెండు నెలల్లోనే పైపులైన్, బోర్లు, సిమెంటు ట్యాంకుల ఏర్పాటు వంటి పనులు పూర్తి కావడంతో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పుష్కలంగా నీరు అందుతుందని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య తీరింది



దశాబ్దాలుగా ఎస్సీ, బీసీ కాలనీల్లో తాగునీటి సమస్య ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాగునీటి కొరకు రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. అధికారుల చొరవతో తక్కువ సమయంలో పనులన్నీ పూర్తి కావడం జరిగింది. కొన్ని ట్యాంకులకు నీటి సరఫరా జరుగుతుండటంతో తాగునీటి సమస్య తీరింది.

– దౌల, కో అప్షన్ సభ్యుడు చనుగొండ్ల